నమస్తే తెలంగాణ
ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 | వరంగల్, గురువారం 29 ఆగస్టు 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

మోదీపై ఆగ్రహజ్వాల

- వరంగల్‌లో ఫ్లెక్సీ దహనం చేసిన బీఆర్ఎస్ శ్రేణులు
- లిక్కర్ కేసులో కథ, స్క్రీన్‌ప్లే అంతా ఆయనేనంటూ ధ్వజం

గిర్మాజీపేట, ఆగస్టు 28 : ఢిల్లీ లిక్కర్ కేసులో 'కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం మోడీయే' అని బీఆర్ఎస్ నాయకులు ఫ్లెక్సీపై రాసి బుధవారం దహనం చేశారు. లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయగా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మసూద్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు వరంగల్ మండిబజార్‌లో స్వీట్లు పంచుతూ సంబురాలు నిర్వహించాయి. అనంతరం ఢిల్లీ లిక్కర్ కేసులో కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం మోడీయేనని ఆగ్రహం వ్యక్తం చేశాయి. కార్యక్రమంలో అంకూస్, నెల్సన్, అప్రోచ్, ఇంతియాజ్, అబ్బు, రాజ్‌కుమార్, మూజ్, లక్ష్మీపుష్ప పాల్గొన్నారు.

మండిబజార్‌లో ఫ్లెక్సీని దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

లైంగిక దాడి కేసులో సంచలన తీర్పు

- బాలిక కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలన్న వరంగల్ పోక్సో కోర్టు
- దేశ చరిత్రలోనే అత్యధిక పరిహారం ప్రకటించిన న్యాయమూర్తి మనీషా

నిందితుడికి 20 ఏళ్ల జైలు, 20 వేల జరిమానా

వరంగల్ లీగల్, ఆగస్టు 28: రెండో తరగతి చదువుతున్న బాలికపై లైంగిక దాడికి పాల్పడిన దుండగుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 20 వేల జరిమానా విధిస్తూ ప్రత్యేక పోక్సో కోర్టు బుధవారం సంచలన తీర్పు ప్రకటించింది. ఈ చట్టం కింద బాలిక కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షలను పరిహారంగా అందజేయాలని పేర్కొని దేశంలో అత్యధిక పరిహారాన్ని ప్రకటించిన న్యాయమూర్తిగా మనీషాశావణ్ నిలిచారు. వివరాలిలా ఉన్నాయి.. రామన్నపేట పరిసరాల్లో నివసించే బాలిక కుటుంబ సభ్యులు ప్రతి ఆదివారం ప్రార్థన కోసం చర్చికి వెళ్తుంటారు. 2019 సంవత్సరం ఫిబ్రవరి 5న ప్రార్థన కోసం వెళ్లిన తమ ఏడేళ్ల పాప ఇంటికి రాకపోవడంతో హైరానాపడ్డ కుటుంబసభ్యులు వెతుకుతుండగా తారసపడింది. తనను ఓ వ్యక్తి చాక్లెట్ కొనిస్తానని మోటర్‌సైకిల్‌పై తీసుకెళ్లి మార్గమధ్యంలో తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని తెలిపింది. బాధిత కుటుంబ సభ్యులు మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఏసీపీ చంద్రయ్య పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి సరైన ఆధారాలతో నిందితుడు రామరూపుల ప్రభుచరణ్‌ను అదుపులో తీసుకొని ప్రశ్నించగా నేరాన్ని అంగీకరించాడు. విచారణ అనంతరం నేరం రుజువైందని భావించిన న్యాయస్థానం ప్రభుచరణ్‌కు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 20 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. ఈ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోకీల సత్యనారాయణ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం పోక్సో చట్టం కింద బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, స్థానిక న్యాయ సేవా సంస్థ బాధితులకు ఈ పరిహారాన్ని బట్వాడా చేయించాలని తీర్పులో పేర్కొంది.

దేశ చరిత్రలోనే అత్యధిక నష్టపరిహారం

ఈ కేసులో పొక్సో కోర్టు న్యాయమూర్తి దేశ చరిత్రలోనే అత్యధిక పరిహారాన్ని ప్రకటించి సంచలన తీర్పు ఇచ్చినందుకు కృతజ్ఞతలు. బాధిత కుటుంబం ఈ ఘటన తర్వాత ఎదుర్కొనే సామాజిక వివక్షతను, వారి పేదరికాన్ని కోర్టు వారి దృష్టికి తీసుకురావడంతో ప్రత్యేక నిధి నుంచి ప్రభుత్వం బాలిక కుటుంబానికి రూ. 10 లక్షలు ఇవ్వాలని తీర్పు ఇవ్వడం సంతోషంగా ఉంది. ఇప్పటి వరకు పోక్సో చట్టం కింద రూ. 5 లక్షలు మాత్రమే ఇస్తుండగా, రూ. 10 లక్షలు ప్రకటించి వరంగల్ పోక్సో ప్రత్యేక కోర్టు ఆదర్శంగా నిలిచింది.

– మోకీల సత్యనారాయణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్

- నగరం సుస్థిరాభివృద్ధి సాధించాలి
- సౌర విద్యుత్‌పై రైతుల్లో అవగాహన కల్పించాలి
- వ్యవసాయ రంగంలో ముందడుగు వేయాలి
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- చారిత్రక ఆలయాలు, ప్రాంతాల సందర్శన, ప్రముఖులు, ప్రజలతో మమేకం
- రెండు జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారుల సమావేశం

వేయి స్తంభాల ఆలయంలో పూజలు చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ,మంత్రులు పొన్నం, సీతక్క, మేయర్ సుధారాణి

వేయి స్తంభాల ఆలయంలో శిల్పాలను పరిశీలిస్తున్న గవర్నర్

ఓరుగల్లు పర్యటన మరువలేని జ్ఞాపకం..

చారిత్రక కట్టడాలు అద్భుతం

వరంగల్/హనుమకొండ చౌరస్తా/ఖిలా వరంగల్, ఆగస్టు 28 : వరంగల్ చారిత్రక, వారసత్వ నగరమని, కాకతీయ రాజుల సామ్రాజ్య నగరంగా ఎంతో ఘనమైన చరిత్ర ఉన్న నగరంగా ప్రసిద్ధి చెందినదని ఈ ప్రాంత పర్యటన మరిచిపోలేదని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆయన వరంగల్ నగరంలో కలియదిరిగారు. ఉదయం ఎన్ఐటీ గెస్ట్‌హౌస్‌కు రోడ్డు మార్గం ద్వారా చేరుకున్నారు. ఆయనకు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కడియం కావ్య, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కె.ఆర్.నాగరాజు, కడియం శ్రీహరి, కలెక్టర్ ప్రావీణ్య పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అక్కడినుంచి నేరుగా హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. జాతీయ గీతాలాపన అనంతరం కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ చారిత్రక కట్టడాలు, ఆలయాలకు వరంగల్ నిలయమన్నారు. చారిత్రక, వారసత్వ వరంగల్ నగరం మరింత సుస్థిరాభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. వ్యవసాయ రంగంలో ముందుండాలన్నారు. పీఎం కుసుమ్ యోజన ద్వారా సౌర విద్యుత్‌ను వినియోగించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. సౌర విద్యుత్‌పై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతున్నదని పేర్కొన్నారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి దిశలో అడుగులు వేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు తనను ఆకట్టుకున్నాయని చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాలు అభివృద్ధి చెందేందుకు రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ఉండటం సంతోషకరమన్నారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాలు ముందంజలో ఉండడం సంతోషకరమన్నారు. స్వయం సహాయక సంఘాలతో మహిళలు మరింత ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. నగరంలో దవాఖానలు పరిశుభ్రంగా ఉండడం సంతోషం కలిగించిందన్నారు.

హనుమకొండ కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, పక్కన మంత్రి పొంగులేటి

రెడ్‌క్రాస్‌లో తలసేమియా బాధితులతో మాట్లాడుతున్న గవర్నర్, పక్కన మంత్రి పొన్నం ప్రభాకర్

జిల్లా అభివృద్ధిని వివరించిన కలెక్టర్లు

వరంగల్, హనుమకొండ, గ్రేటర్‌లో అభివృద్ధి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు. చారిత్రక ఆలయాలు, ప్రదేశాలు, స్మార్ట్‌సిటీ, పార్కులు, జాతీయ రహదారులు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, విపత్తుల నిర్వహణ కోసం వినియోగిస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రతిపాదనలు, వెజ్, నాన్ వెజ్ మార్కెట్లు, కాళోజీ కళాక్షేత్రం, గ్రేటర్ అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, ఎంజీఎం, ఐసీడీఎస్, ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌పై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. నేర నియంత్రణ చర్యలపై సీపీ అంబర్ కిశోర్ ఝా వివరించారు.

తలసేమియా బాధిత చిన్నారులకు పరామర్శ

నగరంలోని రెడ్‌క్రాస్ భవనాన్ని గవర్నర్ సందర్శించి ఎన్‌సీసీ కేడెట్ల వందనం స్వీకరించారు. అనంతరం తలసేమియా వార్డులో చిన్నారులతో ముచ్చటించి పండ్లు అందజేశారు. రెడ్‌క్రాస్ నూతన భవనాన్ని ప్రారంభించారు.

వారసత్వ కట్టడాలు అద్భుతం

వరంగల్‌లో వారసత్వ కట్టడాలు అత్యద్భుతంగా ఉన్నాయని గవర్నర్ అన్నారు. పర్యటనలో భాగంగా వేయిస్తంభాల ఆలయ సందర్శనకు వచ్చిన ఆయనకు ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ ప్రత్యేక పూజలు చేశారు. ప్రొఫెసర్ పాండురంగారావు, జిల్లా పురావస్తుశాఖ అధికారి ఎం.మల్లేశం ఆలయ చరిత్ర, కట్టడం విశిష్టతను వివరించారు. అలాగే భద్రకాళీ ఆలయంలో ప్రధాన అర్చకులు భద్రకాళీ శేషు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చారిత్రక ఖిలావరంగల్ ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ సంప్రదాయ నృత్యాలు, కోలాటాలు, బతుకమ్మలు, బోనాలు, డప్పులతో గవర్నర్‌కు ఖుష్‌మహల్ వద్ద ఘన స్వాగతం పలికారు. కీర్తితోరణాల ప్రాంగణం వరకు స్వాగతం పలికారు. కాకతీయుల పేరిణి, రాణీ రుద్రమదేవి నృత్యరూపకం, చిందు యక్షగానం నృత్యాలను ఆసక్తిగా వీక్షించారు. అనంతరం స్వయంభూ శ్రీ శంభులింగేశ్వరస్వామి దేవస్థానానికి చేరుకోగా అర్చకులు శీలమంతుల శంభులింగం పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం కీర్తితోరణాల విశిష్టతతో పాటు కాకతీయులు కళాఖండాలను టూరిజం అసిస్టెంట్ ప్రమోషన్ ఆఫీసర్ సూర్యకిరణ్ గవర్నర్‌కు వివరించారు. కాకతీయ రాజుల కాలం నాటి కట్టడాలు, శిల్ప సంపదను ఆసక్తిగా తిలకించారు. వరంగల్‌లో అద్భుతమైన కట్టడాలు ఉన్నాయని, శిల్ప సంపద అపూర్వమని కొనియాడారు. వందల ఏళ్ల నాటి వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. వరంగల్ పర్యటన సంతోషాన్ని కలిగించిందని అన్నారు. రామప్ప, వేయిస్తంభాల అలయాలతో పాటు ఎన్నో అద్భుత కట్టడాలను చూడడం మరచిపోలేని అనుభూతి అని చెప్పారు.

కవులు, రచయితలు, అవార్డు గ్రహీతలతో చర్చాగోష్ఠి

కలెక్టరేట్‌లో కవులు, రచయితలు, క్రీడాకారులు, సామాజిక కార్యకర్తలు, జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివిధ రంగాల్లో అవార్డులు పొందిన వారితో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చర్చాగోష్ఠి నిర్వహించారు. లంకా శివరాం ప్రసాద్ (రచయిత), మహ్మద్ అన్వర్ మియా (ఐఎంఏ ప్రెసిడెంట్), మండల పరుశరాములు(సామాజిక కార్యకర్త), గుల్షన్ (ఉర్దూ రచయిత), నాగరాజు (జాతీయ బ్లైండ్ పారాజోడో అవార్డు గ్రహీత), పిట్టల రాములు(చేనేత జాతీయ అవార్డు గ్రహీత), అంపశయ్య నవీన్(సాహిత్య అవార్డు గ్రహీత),పోట్ల పల్లి శ్రీనివాసులు(రచయిత), గజ్జల రంజిత్(పేరిణి నృత్యకారులు), పొండురంగారావు(ఇంటాక్ కో కన్వీనర్), నెల్లుట్ల రమాదేవి(రచయిత), అజిత్‌ఖాన్(అల్ ఇండియా గోల్డ్ మెడలిస్ట్), సారంగపాణి(క్రీడాకారుడు), లక్ష్మీకాంతారావు(సహృదయ నాటక సంఘం), ప్రవీణ్(తానా అధ్యక్షులు), డాక్టర్ విజయచందర్‌రెడ్డి(రెడ్ క్రాస్ అధ్యక్షులు) మరో 40మంది ప్రముఖులతో ముచ్చటించి వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆయచోట్ల మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు బస్వరాజ్ సారయ్య, తీన్మార్ మల్లన్న, మేయర్ సుధారాణి, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, స్టేట్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినితానాజీ వాకాడే, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, దేవాదాయశాఖ ఉప కమిషనర్ శ్రీకాంతారావు, డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్.సునీత, ఈవో కె.వెంకటయ్య, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, డీజీటీడీసీ డీజీఎం ఇబ్రహీం, ఎస్ఎల్ ఏఈఈ రాంప్రసాద్, ఎస్ అండ్ ఎల్ ఇన్‌చార్జీ జీ అజయ్, ఏఐఎస్ సీఏ మడిపల్లి మల్లేశం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్, మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షుడు సంగరబోయిన చందర్, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ కోటలో ప్రదర్శించిన పేరిణి నృత్యాన్ని తిలకిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



అమ్మవారి ఫొటోను గవర్నర్‌కు బహూకరిస్తున్న భద్రాకాళీ ఆలయ ఈవో శేషుభారతి, పక్కన మంత్రులు పొన్నం, సీతక్క, మేయర్ సుధారాణి

లక్నవరం అందాలు బాగున్నాయి

- ములుగులో ఓ గ్రామాన్ని దత్తత తీసుకుంటా.. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

గోవిందరావుపేట, ఆగస్టు 28 : ములుగు జిల్లాలోని ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రకటించారు. పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి లక్నవరంలోని సమ్మక్క-సారక్క దీవిలో బసచేసిన ఆయన బుధవారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అనంతరం మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంతో కలిసి స్పీడ్ బోటు షికారు చేస్తూ లక్నవరం అందాలను తిలకించారు. సరస్సు కట్ట, దీవులు, ఎత్తైన కొండలతో లక్నవరం ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నదన్నారు. ములుగు ప్రాంత అందాలు బాగున్నాయని, ఈ క్రమంలోనే ఒక గ్రామాన్ని దత్తత తీసుకోవాలని అనుకున్నట్లు గవర్నర్ తెలిపారు. గవర్నర్ పర్యటనకు సహకరించిన కలెక్టర్‌కు, పోలీసులకు, ప్రజలకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డి, ఎస్పీ పి.శబరీష్, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, శ్రీజ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్నవరం సరస్సులో స్పీడ్ బోటులో షికారు చేస్తున్న గవర్నర్, మంత్రి సీతక్క

ములుగు మెడికల్ కాలేజీలో తొలి అడ్మిషన్

ఆల్ ఇండియా కోటాలో చేరిన రాజస్థాన్ విద్యార్థిని గౌరీమిథాల

ములుగు, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఆల్ ఇండియా కోటాలో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన గౌరీమిథాలకు తొలి సీటు లభించింది. బుధవారం ఆమె జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలోని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చాంబర్‌కు వచ్చి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. దీంతో ములుగు మెడికల్ కాలేజీ చరిత్రలో తొలి మెడికోగా గౌరీ మిథాల రికార్డుల్లోకి ఎక్కనున్నది. రాష్ట్ర గవర్నర్ ములుగు ప్రభుత్వ దవాఖానను సందర్శించిన సందర్భంగా వెంట ఉన్న మంత్రి సీతక్క గౌరీమిథాలను ప్రత్యేకంగా అభినందించారు. కాగా, ఆల్ ఇండియా కోటాలో ఇప్పటికే ఏడుగురు విద్యార్థులకు ప్రవేశం లభించిందని, వారు రెండు, మూడో కౌన్సెలింగ్ పూర్తయ్యేలోగా కాలేజీలో రిపోర్టు చేయనున్నట్లు తెలిసింది. అలాగే రాష్ట్ర కోటాలో మరో 43 మందికి ప్రవేశాలు లభించనున్నాయి. గౌరీమిథాలను అభినందించిన వారిలో కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ డాక్టర్ పీ శబరీష్, అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌లాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పూజారి కిశోర్‌కుమార్, ఇన్‌చార్జి డీపీవో రహీముద్దీన్, ఎంపీడీవో రామకృష్ణ, ఇతర అధికారులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

మెడికోను అభినందిస్తున్న మంత్రి సీతక్క

పీహెచ్‌డీ అడ్మిషన్లపై హైకోర్టు స్టే

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 28: కాకతీయ యూనివర్సిటీ పీహెచ్‌డీ అడ్మిషన్లపై హైకోర్టు స్టే విధించింది. కేటగిరీ-1లో ఖాళీగా ఉన్న సీట్లను కేటగిరీ-2కు మారుస్తూ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 150వ కేయూ పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 31 మార్చి 2024 వరకు ఏర్పడిన ఖాళీలను కూడా 2021-22 పీహెచ్‌డీ నోటిఫికేషన్ ద్వారా తయారైన మెరిట్ జాబితాలో ఉన్నవారికి అడ్మిషన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. 2021-22 నోటిఫికేషన్‌లో ఖాళీల సంఖ్య పేర్కొని వాటితోపాటు మార్చి 2024 వరకు ఉన్న ఖాళీలను ఏవిధంగా పాత నోటిఫికేషన్‌లో ఉన్న మెరిట్ లిస్ట్‌వారికి కేటాయిస్తారని కొందరు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. నోటిఫికేషన్ తర్వాత ఏర్పడే ఖాళీలను కొత్త నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని, కొత్తగా ఏర్పడే ఖాళీలను పాత నోటిఫికేషన్‌లో భర్తీ చేయడం నిబంధనలకు విరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. కౌంటర్ దాఖలు చేయడానికి వారంరోజులు గడువు కావాలని కేయూ స్టాండింగ్ కౌన్సిల్ వాదించగా, ఆ వారం రోజులు మిగతా సీట్లను భర్తీ చేయడానికా? అని ధర్మాసనం ప్రశ్నించినట్లు తెలిసింది. వాదనలు విన్న హైకోర్టు పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియను నిలిపివేయాలని, ఆ తర్వాత తీర్పు వెలువడేంతవరకు ఎలాంటి అడ్మిషన్లు చేయవద్దని జస్టిస్ వినోద్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది.

కేటీపీపీ తుక్కు కేసు పక్కదారి!

- చక్రం తిప్పిన జెన్‌కో ఉన్నతాధికారి
- చర్యలు లేకుండానే కేసు మూసివేత
- తూతూ మంత్రంగా విజిలెన్స్ విచారణ
- ఏడాదైనా బయటకు రాని నివేదిక
- రూ. 3 కోట్లకు పైనే కుంభకోణం జరిగినట్లు గుసగుసలు

గణపురం, ఆగస్టు 28 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్‌లోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీపీపీ)లో రూ. 3 కోట్లకు పైగా విలువచేసే ఇనుప తుక్కు కుంభకోణం పక్కదారి పట్టిందా? చర్యలు లేకుండానే కేసును మూసేశారా? డబ్బుల రికవరీ జరగలేదా? దీని వెనుక పెద్దల హస్తం ఉన్నదా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఏడాదిగా ఈ కేసు విషయమై చడీచప్పుడు లేకపోవడంతో జెన్కో ఉన్నత స్థాయి అధికారే పక్కబ్రందీగా పక్కదారి పట్టించినట్లు తెలుస్తున్నది. కిందిస్థాయి అధికారులను ప్రశ్నించి వారిపై తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి కేసును మూసేసినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే కేటీపీపీలో ఏదైనా యంత్రం మరమ్మతుకు గురైతే కొత్తది అమర్చడానికి అవసరమైన పరికరాలను నాలుగు స్టోర్ రూముల్లో భద్రపరుస్తారు. బాయిలర్, టర్బైన్, జనరేటర్, చిమ్నీ, కూలింగ్ టవర్‌కు సంబంధించిన అదనపు విడిభాగాలను ఇందులో నిల్వ ఉంచుతారు. వీటిని ఒక డీఈతో పాటు ఇద్దరు ఏఈలు, జేపీఏలు, ఆర్టిజన్లు పర్యవేక్షిస్తారు. ఈ క్రమంలో 2010 నుంచి పాడైపోయిన విడిభాగాలు తుక్కు (స్క్రాప్) కింద విపరీతంగా స్టోర్ రూముల్లో పేరుకుపోయాయి. వీటిని అప్పట్లో అధికారులు టెండర్ల ద్వారా విక్రయించేవారు.



తుక్కు పేరిట కొత్తవి విక్రయం?

ఈ తుక్కును టెండర్ దక్కించుకున్న ఓ ప్రైవేట్ దేశీయ కంపెనీ కొనుగోలు చేస్తున్నది. ఈ క్రమంలో ఆ కంపెనీకి చెందిన ప్రతినిధులతో స్టోర్ రూంలోని కొందరు ఉద్యోగులు కుమ్మక్కై తుక్కుతో పాటు రూ. 3 కోట్లకు పైగా విలువైన కొత్త విడిభాగాలను సైతం తీసుకెళ్లినట్లు ఆరోపణలున్నాయి. తుక్కు వాహనమే కదా అని సెక్యూరిటీ అధికారులు కూడా తనిఖీ చేయకుండానే బయటకు పంపించారు. ఈ విషయం అప్పటి సీఎండీ ప్రభాకర్‌రావు దృష్టికి వెళ్లడంతో జెన్కో చీఫ్ విజిలెన్స్ అధికారి మృత్యుంజయుడ్డిని విచారణ కోసం పంపించారు. ఇప్పటి వరకు బాగానే ఉన్నా.. తొమ్మిది నెలలుగా విచారణ నివేదికను అధికారులు గోప్యంగా ఉంచడంపై అనేక అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. తుక్కు కింద కొత్త పరికరాలను తరలించిన ఉదంతంలో కేటీపీపీ ఉన్నతాధికారుల ప్రమేయం ఉన్నట్లు.. ముందుగా అనుకున్న ప్రణాళిక ప్రకారమే పని కానిచ్చినట్లు వాదనలు వినిపిస్తున్నాయి. జెన్కోలో పనిచేస్తున్న ఓ ఉన్నత స్థాయి అధికారే స్వయంగా ఈ కేసును డీల్ చేసి పక్కదారి పట్టించినట్లు తెలుస్తున్నది. కొందరు ఏడీఈలు, ఎస్ఈలు హస్తం కూడా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. అందువల్లే ముందుగా హడావిడి చేసిన విచారణ అధికారులు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు కిందిస్థాయి సిబ్బందిపై కేసులు నమోదుచేసి కేసును మూసివేసినట్లు కేటీపీపీలో చర్చించుకుంటున్నారు. ఈ కుంభకోణం విలువ రూ. 3 కోట్లు కాదని, అంతకన్నా ఎక్కువగానే ఉంటుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తుక్కు పేరిట కొత్త పరికరాలు అమ్ముకొని సొమ్ముచేసుకున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

పూత లేదు.. కాత లేదు..

- నిండా ముంచిన మధిర 385 రకం పెసర
- 100 ఎకరాల్లో వాటిల్లిన నష్టం
- లబోదిబోమంటున్న ఎర్రచర్లకృతండా రైతులు
- పరిహారం చెల్లించాలని డిమాండ్



పూత కాత లేని పెసర పంటలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

నర్సింహులపేట, ఆగస్టు 28 : అన్నదాతను పెసర పంట కోలుకోలేని దెబ్బ తీసింది. అధిక దిగుబడి వస్తుందన్న ఆశతో సాగు చేస్తే ఏపుగా ఎదిగిందే తప్ప.. పూత.. కాత లేక నష్టాలపాలు చేసింది. రైతులకు నకిలీ విత్తనాలు, నిషేధిత పురుగు మందులు విక్రయిస్తే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని డీలర్లను ఉన్నతాధికారులు హెచ్చరించినప్పటికీ, కిందిస్థాయి సిబ్బంది పట్టింపులేని తనంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాలం కలిసి రాక.. అరకొర వర్షాలతో అష్టకష్టాలు పడుతూ పెసర పంట సాగుచేస్తే కిలో గింజలు వచ్చే పరిస్థితి లేదని ఆందోళన చెందుతున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రూప్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రచర్లకృతండాకు చెందిన రైతులు తెలంగాణ సీడ్స్‌కు చెందిన మధిర 385రకం పెసర విత్తనాలను సుమారు 100 ఎకరాల్లో సాగు చేశారు. పెసర పంటను ముందుగా సాగు చేస్తే ఎక్కువ దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు చెప్పిన మాటలను నమ్మి నాలుగు కేజీల విత్తన ప్యాకెట్‌ను రూ. 550కి ఆగ్రోస్ కేంద్రంలో కొనుగోలు చేశారు. ఏపుగా పెరిగిన పంట చేతికొస్తుందనుకున్న దశలో పూత, కాత లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇదే సమయంలో ఇతర రకాలు సాగు చేసిన రైతుల పంట పూత, కాతతో కళకళలాడుతున్నది. నకిలీ విత్తనాల విక్రయానికి సంబంధించి గతేడాది అధికారులు 19 కేసులు నమోదు చేసినప్పటికీ సీడ్స్ వ్యాపారుల్లో మార్పు రావడం లేదు. దీంతో రైతులు తమ పెసర పంటను వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎకరానికి సుమారు రూ. 30వేల వరకు నష్టం వాటిల్లిందని వారు ఆవేదన చెందుతున్నారు. కాగా,ఈ రకం విత్తనాలు సాగు చేసిన జిల్లాలోని రైతులందరి పరిస్థితి ఇలాగే ఉన్నట్లు తెలిసింది.

కిలో గింజలు వచ్చేటట్టు లేదు..

ఆగ్రోస్ కేంద్రంలో మధిర 385 రకం విత్తనాలు కొనుగోలు చేసి మూడెకరాల్లో సాగు చేస్తే కిలో గింజలు చేతికి వచ్చే అవకాశం లేదు. పంట బాగా పెరిగినప్పటికీ పూత, కాత లేకుండా పోయింది. పెసర పంట ముందు వేస్తే అ